సాక్షి జగిత్యాల

సోమవారం । 3 । జూలై । 2023



పోచమ్మకు బోనం మొక్కులు

కథలాపూర్ : భూషణరావుపేటలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు పూజలు చేశారు.



అమ్మవారికి నైవేద్యం

ఇబ్రహీంపట్నం : గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మతల్లి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
35.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కుల సంఘాల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): కుల సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని గోసంగి కుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణం స్వీకారం ఆదివారం జరిగింది. విద్యాసాగర్‌రావు హాజరై మాట్లాడారు. ప్రతీకుల సంఘానికి నిధులను కేటాయిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వయం కృషి గూడ్స్ ఆటో సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పొన్నాల గౌతంతోపాటు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అభినందించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్లతో గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. వీరీరావుపేటలో స్థానిక గల్ఫ్ అధ్యక్షుడు పెనుకుల అశోక్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. హాయిదేశంలో వలసకార్మికులు పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలతో మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి వారికి, వారి కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా ఉండాలని ఆయన కోరారు. నాయకులు కొత్తపల్లి రాజశేఖర్, ఆరెల్లి సంజీవ్, శ్రీకాంత్, దశరథం, వంశీ, పెనుకుల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి



ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

సారంగాపూర్(జగిత్యాల): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో మనదేశం గణనీయమైన అభివృద్ధి సాధించిందని బీజేపీ నాయకులు అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెంబట్ల, పోచంపేట, కోనాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. శక్తి కేంద్రాల పరిధిలో నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు భోగ శ్రావణి, దంత వైద్యుడు ఎడమల శైలేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బద్దెల గంగరాజం, నాయకులు జక్కుల నిఖిల్, రెంటం జగదీశ్, తోపారపు రాజేశ్, బొడ్డుపల్లి శేఖర్, నిమ్మల ఉదయ్, తేలు నరేశ్, దోసారపు సువర్ణ, ముద్దం శ్రీనివాస్, ప్రమోద్, మల్లేశం, మమత పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



దీక్ష శిబిరంలో నాయకులు

జగిత్యాలటౌన్: గతఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.వెయ్యి కోట్లతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు, పేదవైశ్యులకు రూ.లక్ష సాయం చేయాలనే డిమాండ్‌తో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఆదివారం నిరాహార దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ఇచ్చిన హామీ నాలుగున్నరేళ్లు గడిచినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మహంకాళి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కాగుతున్న కల్తీ!



జగిత్యాల: జిల్లాలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రధానంగా నకిలీ నూనెలు, నాసిరకం ఆహార పదార్థాలను వినియోగదారులకు వండి వడిస్తున్నారు. కొందరు నిర్వాహకులు నిబంధనలు గాలికి వదిలేస్తూ ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. అయినా, అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

- హోటళ్లలో నాసిరకం ఆహార పదార్థాలు
- టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలోనూ అపరిశుభ్ర వాతావరణం
- ప్రజారోగ్యంతో నిర్వాహకుల చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

నాణ్యమైన ఆహారం అందించాలి



భోజన ప్రియులకు స్వచ్ఛమైన, నాణ్యమైన ఆహారం అందించాలి. వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలి. నిబంధనలు పాటించని నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల



రోడ్డుపైనే ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు

జిల్లాలో 500వరకు హోటళ్లు..

- జిల్లాలో సుమారు 500వరకు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, 20 వరకు రెస్టారెంట్లు, 10 వరకు దాబాలు ఉన్నాయి. లెక్కకు మించి టీస్టాళ్లు నడుస్తున్నాయి.
- తమ అవసరాల కోసం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణాలకు వచ్చివెళ్తున్నారు.
- వారు అల్పాహారం, భోజనం కోసం టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లను ఆశ్రయిస్తున్నారు.

అంతటా అపరిశుభ్రతే..

హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో వంట గదులు పరిశుభ్రంగా లేవు. వంటపాత్రలు శుభ్రం చేసేందుకు చాంబర్లు కనిపించడం లేదు. నీటితో పైపైనే శుభ్రం చేస్తూ వాటిలోనే వినియోగదారులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారు. వంట మాస్టర్లు, సర్వర్లు ఆప్రాన్స్, క్యాపులు, గ్లౌస్‌లు ధరించడంలేదు. కొన్నిరోజులపాటు ఫ్రిజ్‌లో నిల్వచేసిన మాంసం, చట్నీ వంటి వాటినే నూనెలో వేసి మళ్లీ ఫ్రై చేసి వడ్డిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నాలుగైదు రోజులపాటు బాగా మరిగిన నూనెను మళ్లీ వినియోగిస్తున్నారని కస్టమర్లు చెబుతున్నారు.

అసలే వానాకాలం.. ఆపై సీజనల్ వ్యాధులు..

- ప్రస్తుతం వానాకాలం ఆరంభమైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.
- ఇవేమీ పట్టని కొందరు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు.. కోళ్ల వ్యర్థాలు, జంతువుల కళేబరాలు, ఎముకల నుంచి తయారు చేసిన కల్తీ నూనెలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.
- వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.
- అయితే, పట్టణాల్లో ప్రతీ 50 వేల మందికి ఒక ఆహార తనిఖీ అధికారి, గ్రామాల్లో లక్ష మందికి ఒక అధికారిని నియమించాలి.
- కానీ, జిల్లాలో ఆహార భద్రత తనిఖీ కార్యాలయం ఉన్నా.. ఇన్‌చార్జి అధికారులతో తనిఖీలు తూతూమంత్రంగా సాగిస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

- హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఫుడ్‌కోర్టులు, ఇతరత్రా చిన్న సెంటర్లలో ఏరోజు ఆహార పదార్థాలను ఆరోజే కస్టమర్లకు అందజేయాలి.
- ఒకసారి వినియోగించిన నూనెను మరోసారి వాడకూడదు.
- భోజనం తయారుచేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి.
- వినియోగదారులు మిగిల్చిన ఆహారాన్ని వెంటనే పడవేయాలి.
- ఆహార పదార్థాలు, మాంసం మిగిలితే వాటికి రసాయనాలు కలిపి ఫ్రిజ్‌లో పెట్టవద్దు.
- పారిశుధ్య విభాగం నుంచి కచ్చితంగా ధ్రువీకరణపత్రం పొందాలి.

నకిలీ విత్తనాలపై నజర్

- నాసిరకం పురుగుమందులపైనా నిఘా
- అనుమతిలేని వ్యాపారులపై ప్రత్యేక దృష్టి
- రంగంలోకి దిగిన వ్యవసాయ, పోలీసు అధికారులు
- జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సారంగాపూర్(జగిత్యాల): జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగుల మందు కట్టడికి జిల్లా వ్యవసాయ, పోలీసు శాఖలు అప్రమత్తమయ్యాయి. ఈ వానాకాలం సాగు పనులు ఇప్పుడిప్పుడే ఆరంభమవుతున్నాయి. కొందరు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుల కొనుగోళ్లకు పూనుకుంటున్నారు. వారికి నాణ్యమైనవి అందేలా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రైవేట్ దుకాణాలు, సింగిల్‌విండోలు, డీసీఎమ్మెస్‌లు, ఆగ్రోస్ పరిధిలోని ప్రతీ షాపులో తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో 420 పురుగుల మందులు, 450 రసాయనిక ఎరువుల దుకాణాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు జిల్లా వ్యవసాయ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

రైతులు ఈ జాగ్రత్తలు పాటించాలి..

- లైసెన్స్ ఉన్న ఎరువుల దుకాణాల్లోనే రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- వీటికి తప్పకుండా బిల్లులు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా భద్రపర్చాలి.
- ఇలా చేస్తే.. అనూహ్యంగా పంటకు నష్టం కలిగితే సంబంధిత కంపెనీ నుంచి పరిహారం పొందే వీలుంది.
- బిల్లు ఇవ్వకుంటే ఏఈవో, మండల వ్యవసాయాధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.
- దుకాణదారు లైసెన్స్‌లో సూచించిన ఇల్లు, లేదా గోదాములోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు నిల్వచేయాలి.
- నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న వ్యాపారులపై సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికే 420 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు.
- ప్యాక్ చేయకుండా, తెల్లసంచుల్లో విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయిస్తున్నారు.
- పత్తి, మిర్చిసాగుచేసే రైతులు ఈ విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వీటి కొనుగోలు సందర్భంగా దుకాణా యజమాని నుంచి కచ్చితంగా బిల్లు తీసుకోవాలి. దానిపై లాట్ నంబరు, కాలపరిమితి తేదీ ఉండేలా చెక్‌చేసుకోవాలి.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు..

ఈవానాకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, రసాయన ఎరువులు అందించేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. మండలస్థాయిలో మండల వ్యవసాయాధికారి, ఎస్సైలతో ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్.. దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తోంది. జిల్లాస్థాయిలో జిల్లా వ్యవసాయాధికారితోపాటు, ఎస్పీ పర్యవేక్షణలో నిఘా బృందాలు పర్యటిస్తున్నాయి. ఫిర్యాదులు అందితే టాస్క్‌ఫోర్స్ ఆకస్మికంగా తనిఖీలు చేస్తోంది.

గోరింటా పూసింది..



గోరింటాకు చూపుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

జగిత్యాల/కోరుట్ల: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహిళలు ఆదివారం గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల ఓల్డ్ హైస్కూల్‌లో ఆర్టీయూ టీఎస్ మహిళా శాఖ ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులు గోరింటాకు వేడుక నిర్వహించారు. ఆషాఢ మాసంలో గోరింటాకుకు ఎంతోప్రాముఖ్యత ఉందని వారు వివరించారు.



జగిత్యాల పట్టణంలో..

ఉద్యోగ భద్రత కరువు

- ఆవేదనలో 74మంది ఈజీఎస్ ఉద్యోగులు

జగిత్యాలరూరల్: గ్రామాల అభివృద్ధి, కూలీల వలసల నివారణ లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పథకం ప్రారంభించింది. స్వగ్రామాల్లోనే కూలీలకు పనికల్పించడం, పల్లెల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తూ వస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కూడా ఈ పథకం సమర్థవంతంగా అమలవుతోంది. కానీ, జిల్లావ్యాప్తంగా ఈ పథకంలో పనిచేస్తున్న 74మంది ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైంది. ఐకేపీ, కాంట్రాక్ట్ లెక్చరర్లు, ట్రాన్స్‌కో, వైద్య, ఆరోగ్యశాఖ తదితర విభాగాల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను రాష్ట్రప్రభుత్వం పర్మినెంట్ చేసింది. కానీ, ఉపాధిహామీలో పనిచేస్తున్న తమకు ఎందుకు విస్మరించిందని ఉద్యోగులు, కూలీలు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 74 మంది ఉద్యోగులు..

- ఉపాధిహామీలో జిల్లా వ్యాప్తంగా 74 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.
- ఇందులో అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లు 14 మంది, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు ఏడుగురు, సాంకేతిక సహాయకులు 34 మంది, సీఈవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు 18 మంది, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఒకరు ఉన్నారు.
- పేస్కేలు అమలు చేయాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.
- కూలీలు కూడా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

జాబ్‌కార్డు ఆధారంగా పనులు..

జాబ్‌కార్డు ఆధారంగా గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. పేద కూలీలను గుర్తించి జాబ్‌కార్డు అందజేసి నిత్యం పని కల్పిస్తున్నారు. తద్వారా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

చేపట్టిన పనులు..

ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలు, హరిత హారం, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, డంపింగ్‌యార్డులు, సీసీరోడ్లు, రైతుకల్లాలు, కాలువలు, రహదారులు, చెరువుల మరమ్మతు, భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడుగుంతల నిర్మాణం, అడవుల సంరక్షణ కోసం కాంటూరు కందకాల తవ్వకం లాంటి అనేక పనులు చేపడుతోంది.

పేస్కేల్ అమలు చేయాలి

ఉపాధిహామీలో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలి. గ్రామాల అభివృద్ధిలో మేం కీలకంగా వ్యవహరిస్తున్నాం.

– దొనకొండ గంగలక్ష్మణ్, ఏపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు

పర్మినెంట్ చేయాలి

ఉపాధిహామీలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసే అన్నిసౌకర్యాలు కల్పించాలి.

– తిరుపతిరావు, ఉపాధి ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు

సమస్యలు తెలుసుకునేందుకే..



హైమాస్ట్‌లైట్లు ప్రారంభిస్తున్న సంజయ్

రాయికల్(జగిత్యాల): గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే మీరు నేను కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. తాట్లావాయిలో ఆదివారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేపట్టారు. వార్డు సందర్శన అనంతరం ప్రజలతో మాట్లాడారు. ప్రతీగ్రామంలో ప్రజల వద్దకు నేరుగా వెళ్లి తానే స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నానని తెలిపారు. సాధ్యమైనంత వరకు అధికారులతో మాట్లాడి సమస్యను అక్కడే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. తాట్లావాయి గ్రామంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, నిరుపేదలకు ఆసరా, బీడీ కార్మికులకు బీడీ పింఛన్లు అందిస్తున్నామని అన్నారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, సర్పంచులు రాగి సాగరిక, నంద్ నాయక్, మారంపెల్లి స్నేహ, ఉపసర్పంచ్ మల్లేశ్, నాయకులు రంజిత్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోధిస్తూ.. బడిలో చేర్పిస్తూ..

- విజయవంతంగా బడిబాట
- తొలివిడత జూన్ 3 నుంచి 17 వరకు
- రెండోవిడత ఈనెల 6 వరకు పొడిగింపు

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించి బడీఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనే ఉద్దేశంతో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే చేపట్టేవారు. ఈసారి జూన్ 3 నుంచి 17వ తేదీ వరకు తొలివిడత బడిబాట చేపట్టి విద్యార్థుల ప్రవేశాలు పెంచేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తద్వారా జిల్లా వ్యాప్తంగా కొత్తగా 5,766 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. కొన్ని గ్రామాల్లో పక్కాగా చేపట్టగా, మరికొన్ని గ్రామాల్లో అంతంతగానే నిర్వహించారనే విమర్శలు వచ్చాయి. దీంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆశించిన లేదని గుర్తించారు. దీంతో మరోవిడత బడిబాట కార్యక్రమం నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది.



కథలాపూర్ మండలం బొమ్మెనలో విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

బోధనకు ఆటంకం లేకుండా..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 380 గ్రామాలున్నాయి.
- వీటి పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 511, ప్రాథమికోన్నత పాఠశాలలు 85, ఉన్నత పాఠశాలలు 187 ఉన్నాయి.
- ఇవేకాకుండా జిల్లాలో మోడల్ స్కూళ్లు 13, కేజీబీవీలు 14 ఉన్నాయి.
- తొలివిడత బడిబాట కార్యక్రమం పూర్తయ్యేసరికి ఈ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య 63,625కు చేరింది.
- రికార్డుల ప్రకారం బడిబాట కార్యక్రమంలో కొత్తగా చేరిన విద్యార్థులు 5,766 మంది మాత్రమే.
- బడిబాట కార్యక్రమంలో ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరలేదని అధికారులు భావించారు.
- దీంతో ఈ కార్యక్రమాన్ని మరోవిడత నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.
- బడిబాట కార్యక్రమాన్ని జూలై 6వ తేదీ వరకు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.
- ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రతీరోజు ఉదయం పాఠశాల సమయానికి ముందు, సాయంత్రం పాఠశాల సమయం పూర్తయ్యాక బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలుపంచుకుంటున్నారు.

అన్ని వసతులు ఉన్నాయి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందిస్తున్నాం. మధ్యాహ్నం రుచికరమైన భోజనం అందిస్తున్నాం. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుంది. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు, విద్యాభిమానులు, ప్రజలు సహకరించాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరుగుతుంది.

– నరేశం, ఎంఈవో, మేడిపెల్లి

క్లుప్తంగా

పాముకాటుతో మహిళా రైతు మృతి


గోపిడి రాజు (ఫైల్)

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన గోపిడి రాజు (57) అనే మహిళా రైతు ఆదివారం పాముకాటుతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గోపిడి రాజు తన పంటచేనులో పెసర పంట సాగుచేసింది. పంట చేతికొచ్చిందని పెసర కాయలను తెంపేందుకు ఆదివారం ఉదయం వెళ్లింది. పెసరకాయను తెంపే క్రమంలో పాముకాటు వేసింది. అక్కడున్న వారు చికిత్సకోసం కోరుట్లలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆస్పత్రి వద్దకు చేరుకోగానే ఆమె మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఆదివారం మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులో చోటు చేసుకుంది. బోధన్‌కు చెందిన ఇద్దరు కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఒకరిని కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఆరుగురిపై కేసు

సారంగాపూర్: భూ వివాదంలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. నాగునూర్ గ్రామ శివారులోని బొట్లకుంట ప్రాంతంలో ఓ వివాదాస్పద వ్యవసాయ భూమికి వెళ్లే దారి ఉంది. ఇక్కడికి అదే గ్రామానికి చెందిన నీలి నరేశ్, నీలి హరీశ్, నీలి రాజవ్వ, మరో వర్గానికి చెందిన మ్యాడవేని నాగరాజు, మ్యాడవేని నరేశ్, మ్యాడవేని నర్సవ్వ వెళ్లి గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గ్రామస్తులు 100కు ఫోన్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పలువురిపై..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన బొనగంటి మల్లయ్య మేకలను అనుమతి లేకుండా తీసుకెళ్లి, డబ్బులు చెల్లించని వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... మల్లయ్యకు చెందిన 10 మేకలను మండలంలోని రంగపేటకు చెందిన రవి రూ.90 వేలకు కొనుగోలు చేశాడు. డబ్బులు చెల్లించకుండా రవితో పాటు, బీర్‌పూర్‌కు చెందిన దుబ్బయ్య, మరికొందరు మల్లయ్య అనుమతి లేకుండా మేకలను ఓ వాహనంలో రంగపేటకు తీసుకెళ్లారు. డబ్బులు చెల్లించాలని మల్లయ్య పలుసార్లు కోరినా, చెల్లించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రవి, దుబ్బయ్యతోపాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కూరలో పురుగు!


కూలో వచ్చిన పురుగు

కొండగట్టు(చొప్పదండి):నాచుపెల్లి జేఎన్టీయూహెచ్ బాలుర మెస్‌లో విద్యార్థులకు వడ్డించిన ఆహారంలో ఇటీవల పురుగు వచ్చిన సంగతి విదితమే. ఇది మరువక ముందే.. బాలికల హాస్టల్‌లో ఆదివారం వండించిన చికెన్ కూరలో పురుగు వచ్చింది. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

టీఎస్‌బీపాస్ అధికారుల రూటే వేరు

- ఇంటి నిర్మాణం చేపడితే చాలు
- సైట్ ఇన్‌స్పెక్టర్ నుంచి టెక్నికల్ టైటిల్ విభాగాల వరకు దోపిడీ
- లబోదిబోమంటున్న ప్రజలు


జగిత్యాల మున్సిపాలిటీ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి సమీపంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టగా అనుమతులు కూడా లభించాయి. చుట్టుపక్కల వారు ఫిర్యాదు చేశారని, నిర్మాణ పనులు ఆపాలని టౌన్ విభాగం అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించినా ఏమీ కాలేదు. కాగా మధ్యవర్తితో కొంత ముడుపులు చెల్లించి మళ్లీ నిర్మాణం చేపట్టుకుంటున్నాడు.

జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ సమీపంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు టీఎస్‌బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. సైట్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లాడు. అక్కడ కొయ్యలు పాతి ఉండటంతో అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో సదరు వ్యక్తి వద్ద ముడుపులు వసూలు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

జగిత్యాల మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల రూటే వేరుగా మారింది. ప్రభుత్వం పారదర్శకంగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలనే ఉద్దేశంతో టీఎస్‌బీపాస్ తీసుకువచ్చింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, టౌన్‌ప్లానింగ్ విభాగంలోని అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. టీఎస్ బీపాస్ ద్వారా ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే ఇంటి అనుమతి ఇవ్వాలి. ఇందులో లొసుగులు తెలుసుకున్న అధికారులు వాటిని ఆసరాగా చేసుకొని అక్రమాలకు తెరలేపుతున్నారు. దశలవారీగా ప్రతి విభాగాలకు ముడుపులు ఇస్తేనే అనుమతులు ఇచ్చే పరిస్థితి నెలకొంది. కొంతమంది అధికారులు మధ్యవర్తులతో ఈ దందాకు తెరలేపుతున్నారు. నిజానికి టీఎస్‌బీపాస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను గడువులోపు అధికారులు అనుమతి లేదా తిరస్కరించకపోతే వాని జీతాల్లో కోత విధించే అవకాశం ఉంది. కానీ పర్యవేక్షణ లేదు.

వసూళ్ల పర్వం..

ఎవరైనా ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ముందుగా టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం సైట్ ఇన్‌స్పెక్షన్‌కు రెవెన్యూ విభాగం వారు వెళ్తారు. కొందరు ముహూర్తాలు చూసుకొని కొయ్యలు పాతడం, చిన్నపాటి గోతులు తీసుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న కొందరు సైట్ ఇన్‌స్పెక్టర్లు అనుమతులు రాకముందే పనులు మొదలుపెట్టారంటూ అందినకాడికి దోచుకుంటున్నారు. సైట్ వద్దకు వెళ్తే రూ.2–3 వేలు ఇవ్వాల్సిందే. రెవెన్యూ సెక్షన్ విభాగంలో కొందరు అధికారులకు టౌన్‌ప్లానింగ్ విభాగంలోని అధికారులే టీఎస్‌బీపాస్‌లోని లొసుగులను తెలుసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

కలిసొచ్చిన టీఎస్‌బీపాస్

అక్రమాలకు తావివ్వొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం టీఎస్‌బీపాస్ తీసుకురాగా అధికారులకు ఇది వరంగా మారింది. ఇంజినీర్లు, కౌన్సిలర్లతో కుమ్మక్కై కొందరు అధికారులు ఇంటి వద్దకే ఫైల్స్ తెప్పించుకుంటున్నారని పట్టణంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీఎస్‌బీపాస్‌తో చాలా నష్టం కలుగుతుందని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

అనుమతులు పొంది ఇల్లు నిర్మించినా..

పూర్తిస్థాయిలో మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొంది ఇల్లు నిర్మించినా కొందరు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు. ఇల్లు నిర్మాణం ప్లాన్ లేకున్నా నిర్మిస్తున్నారని, ఫిర్యాదులు వస్తున్నాయని ఇంటి నిర్మాణం ఆపాలని ఆదేశాలు జారీచేస్తున్నారు. దీంతో చేసేదేమీలేక మళ్లీ అధికారులతో మాట్లాడి ఎంతోకొంత ఇస్తేనే అధికారులు, కౌన్సిలర్లు వెళ్లడం లేదు.

పర్యవేక్షణ లేకే..

జగిత్యాల మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, గతంలో ఈ విభాగంలో ఏసీబీ దాడుల్లో టీపీవో పట్టుబడిన విషయం తెలిసిందే. అయినా అక్రమాలు ఆగడం లేదు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తులు ఎన్ని వస్తున్నాయి, అనుమతులు ఎన్ని రోజులకు ఇస్తున్నారా లేదా అన్నది ఉన్నతాధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. దీనికి తోడు కౌన్సిలర్లు వారి పరిధిలో ఎవరైనా ఇల్లు నిర్మిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వడం, అనుమతి ఉన్నా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం



ఇంటి అనుమతులు ఆన్‌లైన్ ద్వారానే చేసుకోవాలి. ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి సంప్రదించవచ్చు. టీఎస్‌బీపాస్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎవరైనా ఇబ్బందులు పెడితే మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

– బోనగిరి నరేశ్, మున్సిపల్ కమిషనర్

కులవృత్తులకు ప్రభుత్వం అండ


క్షీరాభిషేకం చేస్తున్న రజకులు

జగిత్యాలటౌన్: కుల సంఘాలు, కులవృత్తులకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ధోబీ సేవలను రజక సొసైటీలకు అప్పగించేలా ప్ర భుత్వం జీవో నంబరు 102 జారీచేయడంపై రజకులు జిల్లా కేంద్రంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశా రు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కు ల వృత్తులకు అండగా నిలుస్తున్న సీఎం కేసీ ఆర్‌కు కుల సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరా రు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్ష, ఉ పాధ్యక్షులతోపాటు నాయకులు పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి క్రీడలు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ క్రీడాపాఠశాలల్లో ప్రవేశాల కోసం సోమవారం మండలస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వాసం భీమయ్య తెలిపారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్, వర్టికల్‌జంప్, షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, ఫ్లెక్సిబులిటీ టెస్ట్ వంటి అంశాల్లో మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారని, ఇందులో 4వ, 5వ తరగతి ప్రవేశాల కోసం పోటీలు ఉంటాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- ఉపాధ్యాయులకు అండగా ఉంటాం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- క్యాంపు కార్యాలయంలో టీచర్లతో సమావేశం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్:ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు వసంతను కలిశారు. తాము ఎదుర్కొంటున్న ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన సమస్యపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడారు. జిల్లాల విభజన జరిగిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్స్‌ను పూర్తిస్థాయిలో కొత్త జిల్లాల పరిధిలోకి అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పనులు త్వరితగతిన జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అయిల్నేని నరేందర్‌రావు, బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాద్‌రావు, ఓద్నాల రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వసంతను కలిసిన 'మార్కెట్ కమిటీ'..

ఇటీవల నియమితులైన రాయికల్ మార్కెట్ కమిటీ సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, వైస్ చైర్మన్ బర్కం మల్లేశం, రాయికల్ మండల ప్రెసిడెంట్ కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్' ఐసెట్ ర్యాంకర్లకు సన్మానం



విద్యార్థినులను అభినందిస్తున్న రవీందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కాకతీయ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన ఐసెట్–2023 ఫలితాల్లో రాష్ట్రస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి ఆదివారం సత్కరించారు. కరీంనగర్ సీతారాంపూర్‌లోని కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జి.జాహ్నవి(108), బి.మేఘన (137), బి.గ్రీష్మ (161), సీహెచ్.హర్షిత (228), అర్పియా జాబీన్ (949), ఎన్.విద్య (995), సమీరా మెహరీన్ (1761), ఇ.అనూష (1950), శ్రావణి (2094)లను అభినందించారు. అలాగే 21 మంది విద్యార్థినులు 5 వేలలోపు, 64 మంది 10 వేలలోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. డిగ్రీతోపాటు ఐసెట్, మ్యాట్, క్యాట్, బ్యాంకింగ్, ఇతర జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది విద్యార్థులు ర్యాంకులు సాధించేందుకు దోహదపడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడ్‌పై కొరఢా

- పరిమితికి మించి ద్విచక్రవాహనాలపై ప్రయాణం
- మృత్యువాత పడుతున్న వారిలో యువకులే అధికం
- ఈ ఏడాదిలో ఇప్పటికే 1466 కేసులు నమోదు


ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులు

జగిత్యాల క్రైం: జిల్లాలో నిత్యం పదులసంఖ్యలో యువత ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. ౹టు వీలర్ ఫర్ టు ఓన్లీ౹...అని మోటారు వాహన చట్టం స్పష్టంచేస్తున్న ఈ విషయం అందరికీ తెలిసిందే. అయినా ద్విచక్రవాహనంపై ఎక్కువ మంది ప్రయాణించడం యువకులకు జల్సాగా మారింది. అధునాతన బైక్‌లు కొనుగోలు చేసి ధరూర్, చల్‌గల్ బైపాస్ రోడ్డుతో పాటు, జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డు, గొల్లపల్లి రోడ్డు, ధర్మపురి రోడ్డులో యువకులు ట్రిపుల్ రైడింగ్‌తో హంగామా సృష్టిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల్లో ఎక్కువగా యువకులే మృత్యువాతపడుతున్నారు. జిల్లాలో 2022లో 3,226 కేసులు నమోదు కాగా, 2023లో జనవరి నుంచి ఇప్పటి వరకు 1466 కేసులు నమోదయ్యాయి.

వాహనం అదుపు చేయడం అసాధ్యం..

ప్రతి వాహనానికి దానిని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగా టూ వీలర్‌ను కేవలం ఇద్దరు వినియోగించడానికి వీలుగా రూపొందిస్తుంది. ముందు డ్రైవర్, వెనుక పిలియన్ రైడర్ మాత్రమే ప్రయాణించాలని నిబంధనలున్నాయి. దీనికి సాంకేతికంగా ప్రత్యేక కారణాలు ఉన్నాయి.

ఇంజిన్ కెపాసిటీ

మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజిన్‌కు ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీనినే సాంకేతికంగా ఇంజిన్ కెపాసిటీ అంటారు. ఆ వాహనం ఎందరు ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తే అదే సామర్థ్యంలో ఇంజిన్ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన ప్రయాణికుల కంటే ఎక్కువ మంది ఆ వాహనంపై ప్రయాణిస్తే దాని ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది.

యాక్సిలరేటింగ్ కెపాసిటీ

ఓ వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కి.మీ వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కి.మీ మించదు. ఈ ప్రభావం ఓవర్ టేకింగ్ తదితర సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకోవడంతో చాలామంది యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

బ్రేక్, బ్యాలెన్సింగ్ కీలకం..

ఏదైనా వాహనం ప్రమాదానికి గురికాకుండా ఉండాలంటే బ్రేక్, బ్యాలెన్సింగ్ ఈ రెండూ కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయడం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. ట్రిపుల్ అయితే రైడింగ్ వంటివి చేసినప్పుడు ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీల పైనా పడి ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

కఠిన చర్యలు తీసుకుంటాం



డ్రంకెన్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపటం, ట్రిపుల్ రైడింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు జరిమానాలు మాత్రమే విధిస్తున్నాం. త్వరలో కోర్టుల్లోనూ చార్జిషీట్‌లు దాఖలు చేస్తాం. ట్రిపుల్ రైడింగ్‌ను అదుపు చేయడానికి యువకుల తల్లిదండ్రులు, కుటుంబీకులు సహకారం అందించాలి.

– రాంచంద్రం, ట్రాఫిక్ ఎస్సై

బోధన ఇక సులభతరం

- జిల్లాలో 104 పాఠశాలల్లో డిజిటల్ తరగతులకు ఏర్పాట్లు
- ఒక్కో డిజిటల్ స్క్రీన్‌కు రూ.3 లక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


తరగతి గదిలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్

ఇబ్రహీంపట్నం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ తరగతులను గాను డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో తరగతికి రూ.3లక్షల విలువగల డిజిటల్ స్క్రీన్‌లను మూడు తరగతి గదులకు రూ.9 లక్షలతో ఏర్పాటు చేశారు.

సులభంగా బోధనా

డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమవుతాయి. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠాలు బోధించేటప్పుడు విద్యార్థులు వింటారు. బోధనతో పాటు ప్రత్యక్షంగా చూపించడం ద్వారా మేథోశక్తి పెరుగుతుంది. బోర్డుపై బొమ్మ గీయనవసరం లేకుండా ఉపాధ్యాయులు బొమ్మను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు చూపించవచ్చు. సబ్జెక్ట్ నిపుణులతో విద్యార్థులను మాట్లాడించవచ్చు. విద్యార్థులు ల్యాబ్ గదిలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా తరగతి గదిలోనే బోధన అర్థం అయ్యేవిధంగా చూపించవచ్చు. డిజిటల్ తరగతులను నిర్వహించేందుకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున విద్యార్థులకు బోధించేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. డిజిటల్ బోధనపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

104 పాఠశాలల్లో బోధనకు ఏర్పాట్లు

జిల్లాలోని మన ఊరి – మన బడి కింద ఎంపికైన 104 పాఠశాలల్లో మొదటి విడతగా డిజిటల్ తరగతులు బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో మన ఊరు – మన బడికింద ఎంపికైన ఇబ్రహీంపట్నం, గోధూర్, వర్షకొండ, కొజన్‌కొత్తూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతుల్లో 75 ఇంచులు గల డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

ఆసక్తి పెరుగుతుంది



ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినడం కంటే డిజిటల్ బోధనతో ఎక్కువగా గుర్తు ఉంటుంది. సులభంగా అర్థమై జ్ఞాపకంగా ఉంటుంది. చదువుపై ఆసక్తి పెరుగుతుంది.

– డి.అఖిల , 10వ తరగతి విద్యార్థి, వర్షకొండ

సులభంగా అర్థం అవుతుంది



విద్యార్థులకు బోధనతో పాటు ప్రత్యక్షంగా చూపించడం ద్వారా సులభంగా అర్థమవుతుంది. డిజిటల్ స్మార్ట్ టీవీలతోపాటు గ్రీన్ బోర్డుతో 2డి, 3డి చిత్రాలతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించవచ్చు.

– గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, వర్షకొండ

జ్ఞాపకశక్తి పెరుగుతుంది



ఉపాధ్యాయులు బోధించే పాఠాలు విన్న దాని కంటే ప్రత్యక్షంగా చూస్తే అర్థమవుతుంది. జ్ఞాపకశక్తి కూడా పెరిగి పాఠాలు గుర్తుంటాయి. మండలంలో నాలుగు పాఠశాలల్లో డిజిటల్ తరగతులకు ఏర్పాట్లు చేశాం. మిగతా పాఠశాలల్లో డిజిటల్ తరగతులను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– ఆనందరావు, ఇన్‌చార్జి ఎంఈవో, ఇబ్రహీంపట్నం

అధిక మొత్తం ఆశచూపి..

- సైబర్ నేరగాళ్ల వలలో మోసపోయిన యువకుడు

సారంగాపూర్ : అధిక మొత్తంలో డబ్బులిస్తామని ఆశచూపి మోసపోయిన ఘటన మండలంలోని లచ్చక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దీటి వెంకటేశ్ పటేల్ తన మొబైల్‌కు ఓ కంపెనీ పేరుతో వచ్చిన మెసేజ్ చూసి అధిక మొత్తంలో డబ్బులు సంపాదించేందుకు సులువుగా ఉంటుందని ప్రమోషన్ యాడ్‌ను చూశాడు. సైబర్ నేరగాళ్లు వెంకటేశ్‌కు ఫోన్‌కు ఓ పజిల్ (టాస్క్)ను పంపించారు. రూ.120, రూ.5 వేలు టాస్క్‌ను పూర్తిచేశాడు. మరో రెండ్రోజుల తర్వాత రూ.8వేలు పంపించాలని అనడంతో టాస్క్‌పూర్తి చేసి వెంకటేశ్ రూ.8 వేలు పంపాడు. తర్వాత మరో రూ.28 వేలు పంపిస్తే ముందు పంపిన రూ.8వేలతో పాటు పెద్దమొత్తంలో నీ ఖాతాకు జమవుతాయని సందేశం వచ్చింది. కాగా ముందు పంపిన రూ.8వేలు రాకపోవడంతో మోసపోయినట్లు భావించి వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి కత్తిపోట్లు


గాయపడిన జాకీర్

కోరుట్ల: కోరుట్లలోని హాజీపురాలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురైనట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. ఆదివారం రాత్రి పదిగంటల సమయంలో జగిత్యాలకు చెందిన జాకీర్ (43) మరికొందరితో కలిసి ఓ భార్యభర్తల పంచాయితీ విషయంలో హాజీపురాకు చెందిన ఇబ్రహీం ఇంటి వద్ద ఇబ్రహీం, ఆయన కొడుకులతో మాట్లాడుతుండగా మాటామాటా పెరిగి గొడవకు దిగారు. దీంతో ఇబ్రహీం, ముగ్గురు కొడుకులు కత్తితో జాకీర్‌పై దాడికి దిగారు. ఈ దాడిలో జాకీర్‌కు గాయాలయ్యాయి. చికిత్స కోసం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పెగడపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 1988–89లో చదివిన పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పాఠశాలలో నిర్వహించారు. 34 ఏళ్ల తర్వాత మిత్రులంతా ఒకేచోట కలుసుకొని రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయుడు కిషన్‌రావును ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల జెడ్పీ పాఠశాలలో చదివిన 1999–2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.